# అయిలాపూర్ 'ప్యాక్స్'లో రూ.కోటి 'గల్లంతు'




## రూ.98.57 లక్షల గల్లంతు.. రికవరీపై 'సహకార శాఖ' సైలెంట్

## 'రైతుల నిధుల' దుర్వినియోగం ఆరోపణలపై 2022లో సస్పెన్షన్

## 'సస్పెండ్' అయిన అదే కార్యదర్శి తిరిగి నియామకంపై రాజుకున్న వివాదం

## జీవోల పేరుతో యథాస్థానంలో నియామకం!

## అధికార దుర్వినియోగంపై రైతుల ఆగ్రహం

## ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడంపై బాధితుల ఆవేదన

"కోరుట్ల మండలంలోని అయిలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో కోట్ల రూపాయల దుర్వినియోగం ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గతంలో సస్పెండ్ అయిన కార్యదర్శిని తిరిగి యథాస్థానంలో విధుల్లోకి తీసుకోవడం, అధికారుల నిర్లక్ష్యం, జీఓల వివరణలపై సందేహాలు.. ఈ వ్యవహారం సహకార శాఖ పనితీరుపై అనుమానాలు రేకెత్తిస్తోంది.!"

**- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):**



### ఇప్పటికైనా న్యాయం చేయాలి


**అయిలాపూర్ 'విండో' మాజీ అధ్యక్షులు చింతకుంట సాయిరెడ్డి**

ఈ నేపథ్యంలో అయిలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ అధ్యక్షుడు 'చింతకుంట సాయిరెడ్డి' ఉన్నత అధికారులను వేడుకుంటూ, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దుర్వినియోగం అయిన దాదాపు రూ.కోటి తిరిగి వసూలు చేసి రైతులకు, సంఘానికి న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారిపై కూడా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఇదీ.. నిధుల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యం!

అయిలాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో గతంలో కార్యదర్శిగా పనిచేసిన 'దీకొండ కిషన్'పై సుమారు రూ.98,57,041 మేర రైతుల నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో అప్పటి జిల్లా సహకార అధికారి సూచనల మేరకు 14-02-2022న అతనిని విధుల నుండి సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఈ చర్యతో రైతులు కొంత ఊరట పొందినప్పటికీ, ఆ తరువాత జరిగిన పరిణామాలు అనుమానాలకు దారి తీశాయి.


ర.నెం:606/TDD తేది:16.02.2020
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.,
అయిలపూర్, మం:కోరుట్ల, జిల్లా:జగిత్యాల్.
పాలకవర్గ సభ్యులు



### 'గల్లంతైన' నిధుల రికవరీలో నిర్లక్ష్యం?


సస్పెన్షన్ తర్వాత దాదాపు నాలుగేళ్లు గడిచినా, దుర్వినియోగం అయిన నిధులపై ఇప్పటివరకు ఎలాంటి రికవరీ జరగలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా సహకార అధికారి, సంబంధిత శాఖ ఈ అంశంపై చర్యలు తీసుకోకపోవడం బాధిత రైతుల్లో ఆవేదన కలిగిస్తోంది. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఫలితం లేకపోవడం పరిస్థితిని మరింత సంక్లిష్టం చేసింది.

### జీఓల వివరణపై సందేహాలు!

సస్పెండ్ అయిన వ్యక్తిని తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవడం మరింత వివాదానికి దారి తీసింది. జీఓ నెంబర్ 44 హెచ్ఆర్ పాలసీ ప్రకారం జిల్లా సహకార అధికారి లేదా సంఘ ఇన్‌చార్జ్‌కు అలాంటి అధికారాలు లేవని విమర్శలు వస్తున్నాయి. అయితే అధికారులు మాత్రం కోర్టు ఉత్తర్వులు, జీఓ86 ప్రకారం నియామకం జరిగిందని చెబుతున్నట్లు సమాచారం. నిపుణుల అభిప్రాయం ప్రకారం, 1994 నాటి జీఓ 86 సహకార సంఘ సిబ్బందికి వర్తించదనే వాదన బలంగా వినిపిస్తోంది.

### అధికారులపై ఆరోపణల వెల్లువ

ఈ వ్యవహారంలో సహకార శాఖ అధికారులు తమ అధికారాలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కోర్టులో స్టే పొందేందుకు కూడా అధికారులే సహకరించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో, అతనికి అనుకూలంగా వ్యవహరించడం అనుమానాలకు తావిస్తోంది.


GOVERNMENT OF TELANGANA
COOPERATION DEPARTMENT

From
Sri S. Ramanujacharya,
M.A, L.L.B, B.Ed., HDCM,
District Cooperative Officer,
JAGTIAL.

To
The Chief Executive Officer,
Primary Agricultural Coop. Society Ltd.,
Ailapur(M) Korutla.

Rc. No.1026/2020-C, Dated:02.02.2021.

Sir,

Sub:- Cooperation Department – PACSs – Primary Agricultural Coop. Society Ltd., Ailapur(M) Korutla.- Suspension of Sri D.Kishan, Former CEO Appeal filed – Consider the Appeal – Instructed – Regarding.

Ref:- 1. Proceedings Dated: 31.10.2020, President Primary Agricultural Coop. Society Ltd., Ailapur
2. Appeal Dated 11.11.2020, filed before the DCO,Jagtial.
3. This Office Letter of even No. Dated 21.12.2020.
4. Orders in W.P No.23760 of 2020, of the Hon'ble High Court for the state of Telangana.

****

I am to draw your attention to the subject and reference cited.

Sri D.Kishan, Former CEO of the PACS Ltd., Ailapur has filed appeal on his suspension vide ref 2nd cited. Appeal has been disposed of vide ref 3rd cited.

Subsequently the Hon'ble High Court for the state of Telangana has issued orders vide ref 4th cited.

Accordingly I refer the Appeal to the Managing committee to look onto the Appeal, consider the request of Sri D.Kishan, Former CEO of the society for reinstatement of the individual into duty. And furnish the action taken on the Appeal.

Yours faithfully,
District Cooperative Officer,
Jagtial.

Copy to :-
The Managing committee through the President, Primary Agricultural Coop. Society Ltd., Ailapur(M) Korutla.

### రైతుల్లో పెరుగుతున్న అసంతృప్తి!

ఈ పరిణామాలతో అయిలాపూర్ 'ప్యాక్స్' ప్రాంత రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తమ కష్టార్జిత డబ్బులు దుర్వినియోగం అయినప్పటికీ, బాధ్యులపై చర్యలు లేకపోవడం పై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సహకార వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

(...నిధుల దుర్వినియోగం లెక్కలతో సహా రేపటి సంచికలో..)

# పెండింగ్ కేసుల పరిష్కారమే లక్ష్యం




- డ్రగ్స్, ఇసుక అక్రమ రవాణాపై రాజీలేని పోరాటం
- మహిళలు, పోక్సో కేసుల దర్యాప్తు వేగవంతం
- నేర సమీక్షలో కరీంనగర్‌సీపీ గౌష్ ఆలం

**నేటి సాక్షి, కరీంనగర్:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడమే పోలీస్ యంత్రాంగం ప్రధాన లక్ష్యమని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టం చేశారు. బుధవారం కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అధికారులు తమ పరిధిలోని పెండింగ్ కేసుల డైరీలను సమర్పించి, కేసుల పురోగతిని వివరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. 2024 వరకు పెండింగ్‌లో ఉన్న పాత కేసులు, ఈ ఏడాది నమోదైన తీవ్రమైన నేరాల ప్రస్తుత స్థితిగతులను సమీక్షించారు. ముఖ్యంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, పోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని అధికారులను ఆదేశించారు. సైబర్ నేరాల రిపోర్టింగ్, 'సీఐఆర్' పోర్టల్ వినియోగం, సీసీటీవీ కెమెరాల జియో-ట్యాగింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల మహమ్మారిని అరికట్టేందుకు ఎన్డీపీఎస్‌చట్టం కింద కఠినంగా వ్యవహరించాలని సీపీ ఆదేశించారు. డ్రగ్స్ నియంత్రణతో పాటు ఇసుక అక్రమ రవాణా, పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్‌పై నిరంతర నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహన తనిఖీలు ముమ్మరం చేయాలని, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అలాగే, కలెక్టరేట్, పోలీస్ కమిషనరేట్ ప్రజావాణి ద్వారా వచ్చే దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించి వారికి భరోసా కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీలు వేణుగోపాల్, శ్రీనివాస్, విజయకుమార్, వెంకటస్వామి, మాధవి, యాదగిరిస్వామి, సతీష్‌లతో పాటు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.




### ఎస్సై చంద్రశేఖర్‌కు నివాళి

**నేటి సాక్షి, కరీంనగర్:** ఇటీవల మృతి చెందిన టూ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ సంతాప సభను సీపీ గౌష్ ఆలం ఆధ్వర్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించగా, అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. ఎస్సైకి శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. విధి నిర్వహణలో చంద్రశేఖర్ అందించిన సేవలను అధికారులు స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ, చంద్రశేఖర్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొని దివంగత అధికారికి నివాళులు అర్పించారు.

# అహ్మదీపూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**నేటి సాక్షి గజ్వేల్:** గజ్వేల్ మండలం అహ్మదీపూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో బాధపడిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పాల్గొని, లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. లబ్ధిదారుల వివరాల ప్రకారం తలారి ఆంజనేయులు రూ.14,000, బోయిని పెద్దోళ్ల రవి రూ.12,500, బోయిని కరుణాకర్ రూ.7,500, ఉడిది రవి రూ.14,500 విలువైన చెక్కులు అందుకున్నారు. ఈ సహాయం ఎమ్మెల్సీ యాదవ రెడ్డి సహకారంతో, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఆధ్వర్యంలో మంజూరైనట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాదాసు శ్రీనివాస్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని తీవ్రంగా విమర్శించారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజే ముఖ్యమంత్రి ఆరు గ్యారంటీల ఫైల్‌పై సంతకం చేసినప్పటికీ, ఇప్పటివరకు వాటి అమలు గాని, స్పష్టత గాని లేదని ఆరోపించారు. ప్రజల సంక్షేమంపై

- **కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ నేతల తీవ్ర విమర్శలు**

కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని పేర్కొంటూ, రైతు భరోసా, పంట బోనస్, బీమా పథకాలు నిలిచిపోయాయని ప్రశ్నించారు. రుణమాఫీ కోసం ఇంకా లక్షలాది మంది రైతులు ఎదురుచూస్తున్నారని చెప్పారు. అలాగే ప్రతి సంవత్సరం 2 లక్షల ఉద్యోగాలు, 18 ప్రాజెక్టుల పూర్తి వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల వల్ల అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. అలాగే రాహుల్ గాంధీ మాటలు, ప్రియాంక గాంధీ ఆశలపై నమ్మకం పెట్టుకుని కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలకు ఇప్పుడు వాస్తవం అర్థమవుతోందని అన్నారు. ఈ ప్రభుత్వ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, సర్పంచ్‌లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

**మిట్టకందాలలో రూ. 45 లక్షలతో సి.సి. రోడ్ల పనుల ప్రారంభం**



**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడు మండలంలోని మిట్టకందాల గ్రామ పరిధిలోని వడ్డేపేటలో రెండు సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు బుధవారం భూమి పూజ నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మరియు మాజీ సర్పంచ్ జి. హరిప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోనే గ్రామాలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. నంద్యాల పార్లమెంట్ ఇన్చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్త జయసూర్యల సహకారంతో గ్రామంలో దాదాపు రూ. 45 లక్షల వ్యయంతో మొత్తం 7 సి.సి. రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం అందరినీ కలుపుకొని ముందుకెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి బూత్ ఇన్చార్జ్ ఎల్. శివరాముడు, నాయకులు ఎల్. సురేష్, దేవరాజు, కె. శీను, సయ్యద్ బాషా, అఖిల్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెన్షన్ వాలిడేషన్ చట్టం.. పెన్షనర్లకు గుదిబండ

- **నల్ల బ్యాడ్జీలతో రిటైర్డ్ ఉద్యోగుల నిరసన.. కలెక్టరేట్ వద్ద వినతిపత్రం**
- **ఆర్థిక ప్రయోజనాలకు కోత విధిస్తే ఊరుకోం: ఉస్మాన్ పాషా, మహేందర్ రెడ్డి**

**నేటి సాక్షి (కరీంనగర్):** కేంద్ర ప్రభుత్వం గత సంవత్సరం 25 మార్చి 2025న దొడ్డి దారిన పార్లమెంటులో పెన్షన్ వాలిడేషన్ బిల్లును ప్రవేశపెట్టి చట్టం చేయడం జరిగింది. ఈ చట్టం ద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ లక్షలాదిమంది పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలు కోత విధించడానికి సమయాత్తమవుతున్నది. ఈ చట్టం వల్ల పెన్షనర్లకు కష్టాలు తప్పేలా లేవు. పెన్షనర్లను రిటైర్ అయిన వారిగా రెండు వర్గాలుగా విభజించి వేతన సవరణ సంఘం సిఫారసుల మేరకు ప్రయోజనాలు కల్పిస్తామని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. 1.1.2026 కంటే ముందు పదవీ విరమణ పొందిన వారికి వేతన పెంపుదల, ఆరు నెలలకు ఒకసారి పెంచే కరువు భత్యం మొత్తం లాంటి ప్రయోజనాలను ఇవ్వకుండా తప్పించుకోవడానికే ఈ చట్టాన్ని తెచ్చారని ఈ చట్టం పెన్షనర్లకు ఆర్థిక నష్టం కల్పించేగా విధంగా ఉన్నదని దానిని నిరసిస్తూ ఈరోజు దేశవ్యాప్తంగా పెన్షనర్లందరూ నల్ల బ్యాడ్జీల ద్వారా నిరసన తెలుపుతూ జిల్లా కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ గారి ద్వార ఈ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మాన్యశ్రీ భారత ప్రధాని నరేంద్ర మోడీ గారికి విజ్ఞాపన పత్రం అందచేస్తున్నారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ



రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్ పాషా, జాలి మహేందర్ రెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం పెన్షనర్లకు గుదిబండలా ఉన్నదని, ఉద్యోగులు పదవీ విరమణ పొందిన తర్వాత ఇచ్చే పెన్షన్, మరియు ఆర్థిక ప్రయోజనాలు బిక్ష కాదు అది వారి హక్కని 1952లో భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఒక తీర్పులో స్పష్టం చేసిన విషయాన్ని కూడా గుర్తు చేశారు. ధరల సూచిక ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలువేతన సవరణలు చేయాలని పేర్కొన్నారు. పెన్షనర్లకు ఆర్థిక నష్టం కలిగించే ఈచట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.వి మనోహర్ కుమార్ గౌడ్ ముఖ్యఅతిథిగా,కరీంనగర్ జిల్లా శాఖ ఫైనాన్స్ సెక్రటరీ పొలాస రామచంద్రం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు

పెరుక నాగమోహన్, జిల్లా బాధ్యులు.ఎస్ శంకర స్వామి,కర్ర రాజిరెడ్డి ఖాజాశంషుద్దీన్, కే.వెంకటరమణ, గుర్రం రామస్వామి, వీరేశం, కిష్టయ్య, రమేష్ సీనియర్ పెన్షనర్స్, రామచంద్ర రావు, నారాయణ, అసంబీ మహమ్మద్ ఎస్. సత్యనారాయణ, ఉల్లాల సత్యనారాయణ, ఎస్ రఘుపతి, దయాకర్ రెడ్డి మల్లారెడ్డి పటేల్ సత్యనారాయణ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సర్ బాధితురాలికి పూర్వ విద్యార్థుల భరోసా

**1994-95 బ్యాచ్ మన్నెగూడెం విద్యార్థుల ఉదారత..**



**నేటి సాక్షి, మేడిపల్లి :** భీమారం మండలం మన్నెగూడెం గ్రామానికి చెందిన 1994-95 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ తోటి విద్యార్థినికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతున్న పిస్కా లక్ష్మికి ఆపరేషన్ పూర్తయిన తర్వాత, రేడియోథెరపీ చేయించుకోవడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలుసుకున్న తోటి మిత్రులు స్పందించారు. బుధవారం వీరంతా కలిసి రూ. 22,000 నగదును బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లక్ష్మి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితురాలికి మరిన్ని సహాయ సహకారాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఆపద కాలంలో ఆదుకున్న స్నేహితులకు లక్ష్మి భర్త ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్, మల్లారెడ్డి, తిరుమల్, కోడెం నడిపి, శ్రీధర్, శంకర్ (LIC), శంకర్, గౌరి భూమయ్య, రాజేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

- **పాతగూడూరు పాఠశాల, ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్ సత్యప్రసాద్**
- **వంటగది నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.. అధికారులకు ఆదేశం**

**నేటి సాక్షి, ఎండపల్లి :** అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిధిలోని పాతగూడూరు గ్రామంలో ఆయన విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. ముందుగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న వంటగది పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.



అనంతరం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్ధిదారులకు నిర్ణీత గడువులోగా ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రాము, డీపీవో మదన్ మోహన్, హౌసింగ్ పీడీ ప్రసాద్, తహశీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీవో కృపాకర్, సర్పంచ్ జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి



నేటి సాక్షి, సిరిసిల్ల,(శివకుమార్): జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. గంజాయి సాగు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్, ఆరోగ్య శాఖలు సంయుక్తంగా అవగాహన కల్పించాలన్నారు. మానసిక ఇబ్బందులతో బాధపడే వారు 24ని7 అందుబాటులో ఉండే 14416 టెలీ మానస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాల్లో గంజాయి సాగుపై నిఘా పెట్టాలని, మెడికల్ షాపులు, ఆసుపత్రుల్లో డ్రగ్స్ స్టాక్‌ను నిరంతరం తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. బానిసైన వారికి డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఏఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ వెంకటేశ్వర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మామను.. కత్తితో పొడిచిన అల్లుడు



**నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణంలోని భీముని దుబ్బ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీసిన కత్తిపోటు ఘటన చోటుచేసుకుంది. ఖలీం ఖాన్ అనే వ్యక్తిపై అతని అల్లుడు నవీద్ ఆకస్మికంగా కత్తితో దాడి చేయడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ఫ్లెక్సీ ఎందుకు చింపావురా.? అని అడిగిన పాపానికి కోపోద్రిక్తుడైన అల్లుడు ఈ దాడికి పాల్పడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటన జరిగిన వెంటనే చుట్టుపక్కల ప్రజలు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నించారు. దాడిలో తీవ్రంగా గాయపడిన ఖలీం ఖాన్‌ను స్థానికులు వెంటనే కోరుట్ల ప్రభుత్వ సివిల్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వైద్యులు చికిత్స అందిస్తున్నప్పటికీ, ఆరోగ్య పరిస్థితిపై అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, పరిచయస్తులు ఆందోళన చెందుతున్నారు. స్థానికుల సమాచారం మేరకు, గత మున్సిపల్ ఎన్నికల సమయంలో ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో ఏర్పడిన మనస్పర్థలే ఈ దాడికి కారణమై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి నుంచి కొనసాగుతున్న వ్యక్తిగత విభేదాలు తాజాగా ఈ హింసాత్మక ఘటనకు దారితీసినట్టు భావిస్తున్నారు. 'ఫ్లెక్సీ ఎందుకు చింపావు' అన్న వాగ్వాదం మరింత తీవ్రమై ఈ ఘటనకు దారితీసినట్లు

- **ఫ్లెక్సీ ఎందుకు చింపావురాని అడిగిన పాపానికి ... కోపంతో దాడి**
- **'ఫ్లెక్సీ వివాదం' నేపథ్యంలోనే దాడి జరిగినట్టు అనుమానం**
- **గాయపడిన మామను ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**

చెబుతున్నారు.ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సాక్షులను విచారిస్తూ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. దాడి చేసిన నిందితుడి గుర్తింపునకు ప్రయత్నాలు కొనసాగుతుండగా, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ కత్తిపోట్ల ఘటన స్థానికంగా కలకలం రేపింది.

# కాంగ్రెస్‌కి తిరుపతి రెడ్డి రాజీనామా

**పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి స్వస్తి.. గన్నేరువరంలో రాజకీయ కలకలం**



**నేటి సాక్షి, గన్నేరువరం,(బుర్ర అంజయ్య గౌడ్):** మండలంలోని చొక్కారావు పల్లె కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ముస్కు తిరుపతి రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం తన ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీనియర్ నేత, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడంతోనే తాను కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని కీలక నేత రాజీనామా చేయడంతో స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



**నేటి సాక్షి, మంచిర్యాల జిల్లా:** చెన్నూర్ కోటపల్లి మండలం లో అరైవ్ అలైవ్' మూడవ దశ అవగాహన సదస్సు రోడ్డు ప్రమాదాలను అరికట్టి ప్రాణనష్టాన్ని నివారించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' (ూతీతీఱఙవ ూశ్రీఱఙవ) - 2026 క్యాంపెయిన్ మూడవ దశలో భాగంగా చెన్నూర్ రూరల్ సి.ఐ. క్రిష్ణ ఆధ్వర్యంలో పారుపల్లి చింత ప్రాంతంలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు రోడ్డు భద్రతపై ప్రజలకు మరియు వాహనదారులకు కీలక సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు విధిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని వాహనదారులు నిర్ణీత వేగ పరిమితిని పాటించాలని, అతివేగం ప్రాణాంతకం మరియు మద్యం సేవించి వాహనం నడపరాదు డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపకూడదని సి ఐ కృష్ణ హెచ్చరించారు. నిరంతర పెట్రోలింగ్ మరియు తనిఖీల ద్వారా రోడ్డు నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సి.ఐ.తో పాటు కోటపల్లి ఎస్ ఐ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది మరియు వాహనదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

# డాక్టర్ వసుంధర కు సన్మానం



**నేటిసాక్షి, తిరుమలాయపాలెం(రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం లో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధరకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ మందడి ఇజ్రాయిల్ హాజరై డాక్టర్ వసుంధరకు శాలువా కప్పి సన్మానించారు ఈ సందర్భంగా మందడి ఇజ్రాయిల్ మాట్లాడుతూ డాక్టర్ వసుంధర సుందరకు ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ అవార్డు అరుదైన గౌరవం దక్కిందని గ్రామీణ స్థాయిలో క్షయ వ్యాధి (టిబి) నిర్మూలన కోసం సామర్థవంతంగా పనిచేసే గ్రామస్థాయి ప్రజల్లో అవగాహన పెంపొందించడం రోగుల గుర్తింపు మరియు చికిత్సలు చురుకైన పాత్ర పోషించినందుకు డాక్టర్ వసుంధరకు ఖమ్మం జిల్లా అధికారి డాక్టర్ సుబ్బారావు చేతులమీదుగా సర్టిఫికెట్లు అందుకోవడం చాలా గర్వంగా ఉందని డాక్టర్ వసుంధర వంటి వైద్యులు గ్రామీణ ఆరోగ్య రంగానికే ఆదర్శంగా నిలుస్తారని గ్రామీణ ఆరోగ్య అభివృద్ధికి చేసే కృషి వల్లే డాక్టర్ కి ఈ అవార్డు దక్కిందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో తాళ్ల మల్లయ్య పల్లి జనార్ధన్ ఖాన్ పార్టీ ఉపేందర్ గోపోజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు


# నర్సరీల బలోపేతమే లక్ష్యం

**రూ. 2 కోట్లతో నర్సరీల అభివృద్ధి..**



**నేటి సాక్షి, మంచిర్యాల:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఉద్యాన నర్సరీల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఉట్నూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ తెలిపారు. బుధవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండల కేంద్రంలోని 100 ఎకరాల తోటను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నర్సరీలను బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. ఆగ్రో ఫారెస్ట్రీ, నేషనల్ బ్యాంబు (వెదురు) మిషన్‌లో భాగంగా రూ. 2 కోట్ల నిధులతో నర్సరీలలో మొక్కల పెంపకంతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామని వెల్లడించారు. రైతులకు అవసరమైన మామిడి, వెదురు, పండ్ల మొక్కలు మరియు అలంకరణ మొక్కలను నాణ్యతతో పెంచి, అతి తక్కువ ధరకే అందుబాటులో ఉంచుతామన్నారు. బెల్లంపల్లితో పాటు ఆసిఫాబాద్ జిల్లా రాజంపేట నర్సరీలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

# శంషాబాద్‌లో ఉచిత మజ్జిగ



**నేటి సాక్షి,శంషాబాద్:** ఎండ తీవ్రత దృష్ట్యా శంషాబాద్ బస్టాండ్ వద్ద ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక కార్యకర్త కందకట్ల సిద్ధు రెడ్డి ఆధ్వర్యంలో ప్రయాణికులకు ఉచితంగా చల్లని మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. తన సొంత నిధులతో ప్రతిరోజూ వేలాది మంది దాహార్తిని తీరుస్తూ సిద్ధు రెడ్డి మానవత్వాన్ని చాటుకుంటున్నారు. ఎటువంటి ఆర్భాటం లేకుండా ఆయన చేస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని ప్రయాణికులు, స్థానికులు అభినందిస్తున్నారు.

# నేరాల నియంత్రణే లక్ష్యంగా పని చేయాలి





- శాంతిభద్రతలపై జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ స్నేహ మెహ్రా సమీక్ష
- సాంకేతికతతో కేసుల ఛేదన.. 'విజిబుల్ పోలీసింగ్'తో ప్రజల్లో నమ్మకం

**నేటి సాక్షి, వికారాబాద్:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసులు అంకితభావంతో పని చేయాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దొంగతనాల నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రికవరీ శాతాన్ని పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించి, బాధితులకు తక్షణ న్యాయం అందించాలన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు 'బ్లాక్ స్పాట్'లను గుర్తించి, నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని సూచించారు. కొత్త సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో పాటు పాత వాటికి జియో ట్యాగింగ్ చేయాలన్నారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రోడ్డు భద్రత, డ్రగ్స్ నివారణపై 'అరైవ్ - అలైవ్' కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డీఎస్పీలు జానయ్య, శ్రీనివాసులు, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్, నర్సింగ్ యాదయ్య, వీరేష్ మరియు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# ఆస్తి తగాదా.. అన్నపై గొడ్డలితో దాడి



- చెన్నూర్ మండలం కొమ్మెరలో తమ్ముడి ఘాతుకం.. అన్న పరిస్థితి విషమం
- బాధితుడి వాంగ్మూలం నమోదు చేసిన తహశీల్దార్.. కేసు నమోదు

**నేటి సాక్షి, చెన్నూర్ :** భూ తగాదాల నేపథ్యంలో అన్నపై తమ్ముడు గొడ్డలితో దాడి చేసిన ఉదంతం చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామంలో బుధవారం కలకలం రేపింది. ఆస్తి వివాదం కారణంగా జోగురు రాజయ్య (48)పై అతడి తమ్ముడు మరియు కుటుంబ సభ్యులు గొడ్డలితో దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో రాజయ్య తీవ్రంగా గాయపడగా, స్థానికులు వెంటనే ఆయనను చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ మల్లికార్జున్ ఆసుపత్రికి చేరుకుని బాధితుడి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. భూ వివాదమే ఈ దాడికి ప్రధాన కారణమని ప్రాథమిక విచారణలో తేలింది.

# సి.ఎస్.ఐ సంఘంలో మరియమ్మ పండుగ





- ఘనంగా ప్రార్థనలు.. దైవ సందేశమిచ్చిన డీనరీ చైర్మన్ వేల్పుల ప్రసాద్ బాబు
- స్త్రీల మైత్రి అధ్యక్షురాలు శాంతకుమారి ఆధ్వర్యంలో వేడుకలు.. భక్తుల సందడి

**నేటి సాక్షి, కర్నూలు:** కర్నూలు ఎస్.ఏ.పి క్యాంప్ సి.ఎస్.ఐ (జూ×) సంఘంలో కన్య మరియమ్మ పండుగ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీనరీ చైర్మన్ రెవరెండ్ వేల్పుల ప్రసాద్ బాబు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు దైవ సందేశాన్ని అందించారు. మరియమ్మ త్యాగమూర్తి అని, దేవుని ప్రణాళికను నెరవేర్చడంలో ఆమె చూపిన సహనం, విశ్వాసం క్రైస్తవులందరికీ ఆదర్శనీయమని ఆయన పేర్కొన్నారు. స్త్రీల మైత్రి అధ్యక్షురాలు వేల్పుల శాంతకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో సంఘస్తులందరూ కలిసి ప్రసాద్ బాబు దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రసాద్ బాబు మాట్లాడుతూ.. రాబోయే ఈస్టర్ పండుగ ప్రాముఖ్యతను వివరిస్తూ, క్రీస్తు చూపిన ప్రేమ, క్షమాపణ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. సమాజంలో స్త్రీలకు సముచిత గౌరవం అందించాలని, పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్త్రీల మైత్రి సెక్రటరీ నిర్మల దేవి, ట్రెజరర్ పద్మ మరియు పెద్ద సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు. వేడుకల అనంతరం భక్తులకు విందు భోజన సౌకర్యం కల్పించారు.

# వెల్గటూర్‌లో 'జీవన్' రాజీనామా ప్రకంపనలు



- జీవన్ రెడ్డి వెంటే మేము.. ఏఎంసీ చైర్మన్ గుండాటి గోపిక రాజీనామా
- నేడు మార్కెట్ కమిటీ పదవికి స్వస్తి.. మండలంలో రాజకీయ అలజడి

**నేటి సాక్షి, ఎండపల్లి:** జగిత్యాల రాజకీయాల్లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు వెల్గటూర్ మండల కాంగ్రెస్‌లో కలకలం రేపుతున్నాయి. మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడంతో, ఆయనకు మద్దతుగా మండలంలోని కీలక నేతలు పదవులను వీడుతున్నారు. బుధవారం జగిత్యాలలో జరిగిన ఆత్మీయ సమావేశం అనంతరం, ఉమ్మడి వెల్గటూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాటి గోపిక-జితేందర్ రెడ్డి తన పదవికి మరియు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. "మేమున్నాం మీ వెంట.. జై జీవన్" అంటూ ఆమె తన నిరసనను వ్యక్తం చేశారు. 40 ఏళ్లుగా పార్టీని నమ్ముకున్న జీవన్ రెడ్డికి అధిష్టానం అన్యాయం చేసిందని, ఆయన గౌరవం కోసమే తాము కూడా పదవులను వదులుకుంటున్నట్లు పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి వెల్గటూర్ ప్రాంతంతో ఉన్న సుదీర్ఘ అనుబంధం దృష్ట్యా, రానున్న రోజుల్లో మరికొందరు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా అదే బాటలో నడిచే అవకాశం కనిపిస్తోంది. ఈ రాజీనామాల పర్వం మండల రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ధన్వాడ సంత బజార్ వేలంపాట

**సర్పంచ్ జ్యోతి సమక్షంలో ముగిసిన వేలం ప్రక్రియ**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం సంత బజార్ వేలంపాట నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి. జ్యోతి సమక్షంలో జరిగిన ఈ వేలంలో ధన్వాడ గ్రామానికి చెందిన జుట్ల గోవర్ధన్ గౌడ్ రూ. 5 లక్షల 15 వేలకు పాటను దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ధన్వాడ మండల ఎంపీఓ వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ ఏడాది సంత ద్వారా పంచాయతీకి మంచి ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ రాష్ట్ర నేత కుంభం శివకుమార్ రెడ్డి**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** ధన్వాడ మండల పరిధిలోని రామకృష్ణయ్య పల్లి గ్రామంలో బుధవారం ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం పండుగలా జరిగింది. ఈ వేడుకకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కుంభం శివకుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహప్రవేశాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కవిత తిరుపతయ్య నాయక్ ఆధ్వర్యంలో కుంభం శివకుమార్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పీఏ మాధవరెడ్డి, ఉప సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, పార్టీ నాయకులు ఆసి రెడ్డి, వార్డు సభ్యులు, ఒగ్గు రాజు, ఎర్ర మల్లప్ప, జేసీబీ రాజు మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పక్కిరయ్య మృతి తీరని లోటు

**పార్థివ దేహానికి నివాళులర్పించిన మాజీ సర్పంచ్ రామసుబ్బమ్మ**



**నేటి సాక్షి, పాములపాడు :** పాములపాడు మండలంలోని వేంపెంట గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త దూదేకుల పక్కిరయ్య గుండెపోటుతో మృతి చెందడం పట్ల మాజీ సర్పంచ్ టేకూరి రామసుబ్బమ్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన నివాసానికి చేరుకున్న ఆమె, పక్కిరయ్య పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సింగపూర్ తెలుగు సమాజం ఉపాధ్యక్షుడు, అంతర్జాతీయ సమాజ సేవకుడు డాక్టర్ టేకూరి నాగేశ్వరరావు కూడా పక్కిరయ్య మృతి పట్ల సంతాపం ప్రకటించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోనపల్లె సత్యరాజు, మాజీ ఎంపీటీసీ శివకుమార్, బూత్ కన్వీనర్ వినయ్ కుమార్, చిన్నస్వామి ఆచారి, యువరాజు మరియు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చౌడేపల్లి పంచాయతీకి వేలంపాట



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** చౌడేపల్లి పంచాయతీకి నిర్వహించిన వివిధ వనరుల ద్వారా రూ 11.81 లక్షలు పాదాయంగా సమకూరినట్లు మదనపల్లి డివిల్పిఓ నాగరాజా తెలిపారు, స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటలో సొంత గేటును సంవత్సరం కాలం పాటు గేటు వసూలు చేసే హక్కును గిరినాయుడు రూ 9.90 లక్షలు అదేవిధంగా ప్రైవేటు బస్టాండ్ వసూలు చేసే హక్కును శ్రీరాములు రూ 1.91 లక్షలు ప్రత్యేక పాడు దక్కించుకున్నారని వివరించారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గఫూర్ పంచాయతీ కార్యదర్శి శివకుమార్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు,

# వ్యర్థాలతో అద్భుతాలు.. విద్యార్థుల సృజన





- **నారాయణపేట జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో 60 మంది విద్యార్థుల ప్రదర్శన**
- **విజేతలకు బహుమతులు అందజేసిన డీఈవో డాక్టర్ గోవిందరాజు**

**నేటి సాక్షి, నారాయణపేట ,(ఇమామ్ సాబ్):** తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో బుధవారం జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి 'వ్యర్థాలతో సంపద' ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ పోటీల్లో 13 మండలాల నుండి సుమారు 60 మంది విద్యార్థులు పాల్గొని ప్లాస్టిక్, గాజు, కొబ్బరి పీచు, ఆవు పేడ వంటి వ్యర్థ పదార్థాలతో ఆకర్షణీయమైన వస్తువులను తయారు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ గోవిందరాజు మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని, వ్యర్థాలను పునర్వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. పోటీల్లో కోస్గి మండలం మీర్జాపూర్ పాఠశాల (పి. అఖిల, డి. మనీషా) ప్రథమ బహుమతి సాధించగా, గుండుమాల్ మండలం బోగారం పాఠశాల ద్వితీయ, జాజాపూర్ పాఠశాల తృతీయ బహుమతులు గెలుచుకున్నాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను



అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ కార్ప్స్ కోఆర్డినేటర్ భాను ప్రకాష్, ఎంఈఓ బాలాజీ, ప్రధానోపాధ్యాయులు భారతి తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలు.. ప్రాణాలకు రక్షణ




- **రోడ్డు భద్రతపై జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులు: ఎస్పీ డాక్టర్ వినీత్**
- **హెల్మెట్, సీటు బెల్ట్ తప్పనిసరి.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్):** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మూడో విడత రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలను బుధవారం విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాపాయం నుండి తప్పుకోవచ్చని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వంటివి ప్రమాదాలకు ప్రధాన కారణాలని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను వెంట ఉంచుకోవాలని కోరారు. సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది మరియు వాహనదారులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బకాయిలు వెంటనే చెల్లించాలి



- **ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై కంచర్ల రవి గౌడ్ ధ్వజం**
- **రూ. 850 కోట్ల బకాయిలతో విద్యార్థుల అవస్థలు.. నిరసన హోరు**

**నేటి సాక్షి, సిరిసిల్ల ,(శివకుమార్):** రాష్ట్రంలోని విద్యార్థులకు రావాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిరిసిల్లలోని చేనేత చౌక్ వద్ద కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని, సుమారు రూ. 850 కోట్లకు పైగా బకాయిలు ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం కరోనా వంటి కష్టకాలంలోనూ విద్యార్థులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో మద్యం శాఖకు మంత్రి ఉన్నా, విద్యాశాఖకు మంత్రి లేకపోవడం దురదృష్టకరమని ఎద్దేవా చేశారు. బకాయిలు విడుదల చేయకుంటే మంత్రులు, ఎమ్మెల్యేలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె అఫ్ రోజ్, సాయి తేజ, ఎండి అజ్జు, చరణ్, వినయ్, నిఖిల్, శశాంక్ మరియు విద్యార్థి నేతలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

- **ఎల్లారెడ్డిపేటలో మోడల్ హౌస్, గుండారంలో గృహప్రవేశాలు ప్రారంభించిన కలెక్టర్**
- **రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: గరిమ అగ్రవాల్**



**నేటి సాక్షి, ఎల్లారెడ్డిపేట,( శివకుమార్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అందుతున్న రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో హౌసింగ్ మోడల్ హౌస్‌ను ప్రారంభించిన కలెక్టర్, అనంతరం గుండారం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మించిన సిద్ధాల అఖిల, కంకణాల శ్రీలత, ఇందిరాల మమత, లకావత్ సునీతల ఇందిరమ్మ ఇండ్లకు పండుగ వాతావరణంలో గృహప్రవేశాలు చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో, ఉష్ణోగ్రతను తగ్గించే 'ఫిల్లర్ రూఫింగ్' విధానంలో మోడల్ హౌస్ నిర్మించడం అభినందనీయమన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 777 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. లబ్ధిదారులకు అవసరమైన సామగ్రి, పనివారు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా 10 శాఖల ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సబేరా బేగం, తహసీల్దార్ సుజాత తదితరులు పాల్గొన్నారు.